క్లుప్తంగా

మంద కృష్ణ పాదయాత్రకు సంఘీభావం



పాదయాత్ర చేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ గురువారం బాలాపూర్‌లో చేపట్టిన పాదయాత్రకు జాంబవ వారసులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మందకృష్ణను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పేరెల్లి శ్రీను, మరికంటి కన్నారావు, కేదాస్ కృష్ణ, కోటేశ్వరావు, అంబేద్కర్, పల్లె పోగు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

46 మంది బైండోవర్



వాహనాన్ని తనిఖీ చేస్తున్న సీఐ శ్రీధర్

రఘునాథపాలెం: ఎన్నికల నిబంధనల మేరకు రఘునాథపాలెం కోయచలక క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన పోలీసు చెక్‌పోస్ట్ వద్ద స్థానిక ఇన్‌స్పెక్టర్ కె.శ్రీధర్ ఆధ్వర్యాన గురువారం ఎస్‌ఐలు, సిబ్బంది చెకింగ్ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో బెల్ట్‌షాపుల నిర్వాహకులు, రౌడీ షీటర్లను బైండోవర్ చేసి తహసీల్దార్ ఎదుట హాజరు పరిచి వ్యక్తిగత పూచీకత్తుపై వి డుదల చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మొత్తం 46 మంది బెల్ట్‌షాపు నిర్వాహకులను బైండోవర్ చేశారు.

బైరవునిపల్లిలో బీఆర్‌ఎస్‌కు షాక్



రాజీనామా చేసిన మాజీ ఎంపీటీసీ నూక నాగయ్యతో నాయకులు

నేలకొండపల్లి: మండలంలోని బైరవునిపల్లిలో బీఆర్‌ఎస్‌కు గురువారం పలువురు రాజీనామా చేశారు. బుధవారం ఎంపీటీసీ మరికంటి ఉమారాణి, రమేష్ దంపతులు రాజీనామా చేసిన విషయం విదితమే. గురువారం వీరి సమక్షంలో మాజీ ఎంపీటీసీ నూక నాగయ్య, పలువురు వార్డు సభ్యులతో పాటు మరికొంత మంది రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తామంతా ఏ పార్టీలో చేరనున్నది అనేది త్వరలో తన అనుచరులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఎంపీటీసీ దంపతులు తెలిపారు.

వైన్ షాపుల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌ఓ రాజేశ్వరి

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం పరిధిలోని వరంగల్ క్రాస్‌రోడ్‌లో గల ఓ వైన్ షాపును పాలేరు ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి రాజేశ్వరి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణంలో ఉన్న స్టాక్, రిజిస్టర్‌లో నిల్వలను పరిశీలించారు. దుకాణం నిర్వాహకులు ఇష్టానుసారం నిబంధనలకు విరుద్ధంగా మద్యం నిల్వలు ఉంచరాదని, నిబంధనల మేరకే అమ్మకాలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ రాజిరెడ్డి, తహసీల్దార్ బీ.వీ.రామకృష్ణ, ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	20	బచ్చలికూర	2
వంకాయ	30		10
బెండకాయ	16	పాలకూర	3
పచ్చిమిర్చి	38		20
కాకర	36	చుక్కకూర	3
బోడ కాకర	80		20
బీర	36	తోటకూర	3
దొండ	24		20
పొట్లకాయ	36	గోంగూర	2
చిక్కుడు	86		10
గోరుచిక్కుడు	36	మెంతికూర	3
క్యాబేజీ	18		10
క్యాలీఫ్లవర్	26	కొత్తిమీర	1
ఆలుగడ్డ	24		20
చామగడ్డ	40	పుదీన	1
క్యారెట్	36		20
క్యాప్సికం	60	-ఖమ్మం వ్యవసాయం	



ఓపెన్‌జిమ్‌లో వ్యాయామం చేస్తున్న స్థానికులు



చిన్నారుల ఆటస్థలం



'ఐ లవ్ ఖమ్మం' లోగో

ఆహ్లాదం అందించేలా..

బురహాన్‌పురంలో ఫ్రీడమ్ పార్కు నిర్మాణం

- వ్యాయామానికి అనువుగా ఓపెన్ జిమ్‌లు
- పిల్లల కోసం ఊయలలు, ఇతర ఆట వస్తువులు
- ప్రత్యేకంగా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు
- దేశభక్తిని చాటేలా అమరుల స్తూపం



బురహాన్‌పురంలోని ఫ్రీడమ్ పార్కు

ఖమ్మంవన్‌టౌన్: ఆహ్లాదకరమైన వాతావరణం పొందాలంటే ముందుగా గుర్తుకొచ్చేది పార్కులు. మారుతున్న జీవనశైలితో వ్యాయామం కూడా ప్రతీ ఒక్కరికి తప్పనిసరి కావడంతో ఇవి మంచి ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడమే కాకుండా ఉదయం, సాయంత్రం వేళల్లో వ్యాయామానికి సైతం ప్రధాన కేంద్రాలుగా మారాయి. ఈ నేపథ్యాన ప్రజావసరాలను గుర్తించిన ప్రభుత్వం కరోనా మహమ్మారి విపత్తు అనంతరం విరివిగా పార్కులు, ఓపెన్‌జిమ్‌లను ఏర్పాటు చేసింది. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ప్రత్యేకమైన చొరవతో నగరంలోని అన్నీ డివిజన్లలో పార్కులు ఏర్పడి వాటిలో ఓపెన్ జిమ్‌లు, చిన్నారులకు ఆటవిడుపుగా వస్తువులు, ఊయలలు ఏర్పాటు చేయడంతో ఉదయం వాకర్స్‌తో, సాయంత్రం చిన్నారులతో పార్కులు నిత్యం కళకళలాడుతున్నాయి.

వ్యాయామానికి ఓపెన్ జిమ్‌లు...

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా నగరంలోని నూతన మున్సిపల్ కార్యాలయం పక్కన 53, 51వ డివిజన్లలో నిర్మించిన పార్కులకు ఫ్రీడమ్ పార్కులుగా నామకరణం చేశారు. ఇందులో పెద్దలు నడిచేందుకు వాకింగ్ ట్రాక్‌తో పాటు శారీరక వ్యాయామం చేసేందుకు పలు రకాల పరికరాలను అందుబాటులో ఉంచారు. పిల్లలను ఆకట్టుకునేందుకు ఇనుప వస్తువులతో రోబోట్‌ను సైతం ఏర్పాటు చేశారు. సుమారు రెండెకరాల విస్తీర్ణంలో ఈ ఫ్రీడమ్ పార్కులను ఏర్పాటు చేసి గట్టయ్యసెంటర్, వీడియోస్ కాలనీ, బైపాస్‌రోడ్డు, బురహాన్‌పురం, ఎన్నెస్పీ ప్రాంతవాసులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. కొత్త బస్టాండ్‌కు అతి సమీపంలో సైతం ఫ్రీడమ్ పార్కును అభివృద్ధి చేసి అటు ప్రయాణికులు, ఇటు వివిధ పనుల నిమిత్తం నగరానికి వచ్చేవారు సేదతీరేందుకు ఇవి ఉపకరిస్తున్నాయి.

కార్గిల్ వీరుల చిహ్నంగా స్తూపం...



53వ డివిజన్‌లో ఉన్న ఫ్రీడమ్ పార్కు పక్కనే విశ్రాంత సైనికుల సంక్షేమ కార్యాలయం ఉంది. ఆ డివిజన్ కార్పొరేటర్ పగడాల శ్రీవిద్య నాగరాజు ప్రత్యేకంగా చొరవ చూపి కార్గిల్ అమరవీరుల చిహ్నంగా అమర జవాన్ స్తూపాన్ని ఏర్పాటు చేశారు. వారు అడిగిన వెంటనే కలెక్టర్ వీపీ గౌతమ్, నగరపాలక సంస్థ కమిషనర్ వెంటనే స్పందించి స్తూప నిర్మాణానికి నిధులు సైతం మంజూరు చేశారు.

సౌకర్యంగా ఉంది..



ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేయడానికి ఈ పార్కులు ఎంతో సౌకర్యంగా ఉంది. ఇది వరకు వాకింగ్ చేయాలంటే సర్దార్ పటేల్ స్టేడియానికి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు మాకు అతిచేరువలో పార్కు ఏర్పాటు చేయడంతో పాటు వ్యాయామానికి అనేక రకాల పరికరాలను అందుబాటులో ఉంచడం శుభపరిణామం.

– సామినేని మంజుల, గట్టయ్యసెంటర్

రోజూ షటిల్ ఆడుతున్నాం..



ఫ్రీడమ్ పార్కులో వాకింగ్ ట్రాక్, పిల్లలకు ఆట వస్తువులతో పాటు షటిల్ కోర్టును కూడా ఏర్పాటు చేశారు. దీంతో ఈ ప్రాంతంలో ఉన్న యువత క్రమంతప్పకుండా రోజూ షటిల్ ఆడుతున్నాం. పార్కులో షటిల్ కోర్టు వేయించిన కార్పొరేటర్‌కు ధన్యవాదాలు.

– జక్కుల వినయ్‌రెడ్డి, బైపాస్ రోడ్డు

అమరుల స్తూపం అభినందనీయం..



ఫ్రీడమ్‌పార్కులో కార్గిల్ యుద్ధ అమరవీరుల చిహ్నంగా అమర్ జవాన్ స్తూపాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం. ఈ స్తూప నిర్మాణంతో విజయ్‌దివస్ ప్రతి ఏటా ఘనంగా జరుపుకుంటాం. సుమారు రూ.6 లక్షలను ఈ స్తూప నిర్మాణానికి వెచ్చించి అమరవీరులకు ఆత్మకు శాంతి కలిగేలా చేశారు.

– యుగేందర్, విశ్రాంత ఆర్మీ ఉద్యోగి

ప్రజలకు అందుబాటులో..



53వ డివిజన్‌లోని ఎన్నెస్పీ స్థలాల్లో మంత్రి అజయ్, ఇతర అధికారుల చొరవతో సుమారు రూ.40 లక్షల వ్యయంతో రెండు పార్కులను అభివృద్ధి చేశాం. ఈ పార్కులు ఇప్పుడు సుమారు మూడు డివిజన్ల ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. అంతే కాక ఎన్నెస్పీ పాఠశాల విద్యార్థులకు సైతం ఎంతగానో ఉపయోగపడుతుంది.

– పగడాల శ్రీవిద్య, 53వ డివిజన్ కార్పొరేటర్

కాంగ్రెస్‌లో చేరిన సర్పంచ్



పార్టీలో చేరిన వారితో ప్రసాదరెడ్డి

ఖమ్మం రూరల్/కూసుమంచి: కూసుమంచి మండలంలోని కేశ్వాపురం సర్పంచ్ ధరావత్ కోటమ్మ దంపతులు గురువారం బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. ఖమ్మంలోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో వారికి పార్టీ నాయకుడు పొంగులేటి ప్రసాదరెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. అలాగే, వార్డుసభ్యుడు ధరావత్ రాంబాబుతోపాటు శ్రీను, కృష్ణ, బాష్‌సింగ్ తదితరులు కూడా పార్టీలో చేరారు. నాయకులు ఇంటూరి పుల్లయ్య, పెండ్ర అంజయ్య, బానోత్ లక్ష్మణ్, తాళ్లూరి వెంకటేశ్వర్లు, బానోత్ వినోద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఖమ్మంరూరల్ మండలంలోని పలు గ్రామాల్లో పొంగులేటి ప్రసాద్‌రెడ్డి గురువారం పర్యటించారు. కస్నాతండా, ఎం.వెంకటాయపాలెం, పల్లెగూడెం, రెడ్డిపల్లి గ్రామాల్లో జరిగిన కార్యక్రమాలకు హాజరైన ఆయన మాట్లాడుతూ రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను నెరవేర్చడం ఖాయమని తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కళ్లెం వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకూ కాంగ్రెస్

ఖమ్మంవన్‌టౌన్: నేడు నేలకొండపల్లి మండలంలోని తిరుమలాపురం గ్రామంలో సాయంత్రం 5గంటలకు, పైనంపల్లిలో సాయంత్రం 7 గంటలకు గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి పాల్గొననున్నారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభంజనం ఖాయం

ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్యే హరిప్రియ



మాట్లాడుతున్న ఎంపీ రవిచంద్ర, పక్కన ఎమ్మెల్యే హరిప్రియ

కామేపల్లి: గ్యారంటీ, వారంటీ లేనిది కాంగ్రెస్ పార్టీ అయితే... తెలంగాణ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో తీర్చిదిద్దుతున్నది సీఎం కేసీఆర్ అని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర వెల్లడించచారు. మండలంలోని ముచ్చర్లలో గురువారం జరిగిన బీఆర్‌ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియతో కలిసి ఎంపీ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం కేసీఆర్ వచ్చే నెల 1న ఇల్లెందులో జరిగే ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొంటారని, ఈ సభకు మండలం నుంచి వేలాదిగా తరలిరావాలని సూచించారు. మూడోసారి బీఆర్‌ఎస్ ప్రభంజనం సృష్టించి కేసీఆర్ కావడం ఖాయమైనందున, మాయమాటలతో వచ్చే కాంగ్రెస్, బీజేపీ నేతలను నమ్మొద్దని కోరారు. ఎమ్మెల్యే హరిప్రియ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే ఇల్లెందు నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని చెప్పారు. ప్రతిపక్ష పార్టీల తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టడమేకాక బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరించాలని సూచించారు. తొలుత కొత్తలింగాల శ్రీ కోటమైసమ్మతల్లి ఆలయంలో ఎమ్మెల్యే హరిప్రియ పూజలు చేశాక క్రాస్ రోడ్డులో బీఆర్‌ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సమావేశంలో ఎంపీపీ బానోత్ సునీత, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ధనియాకుల హన్మంతరావుతో పాటు అంతోటి అచ్చయ్య, వడియాల కృష్ణారెడ్డి, మల్లెంపాటి శ్రీనివాసరావు, సామా మోహన్‌రెడ్డి, బోడేపూడి వీరప్రతాప్, కీసర విష్ణువర్ధన్‌రెడ్డి, గుగులోత్ గబ్రూనాయక్, కాట్రాల రాంబాబు, జాటోత్ జాయ్‌లూసీ, బొడ్డు కాంతమ్మ, నాగండ్ల లక్ష్మణ్‌చౌదరి, లకావత్ బీమానాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ శ్రేణుల ప్రచారం

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండ గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీ ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ గెలుపును కాంక్షిస్తూ గురువారం ఆ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. తొలుత గ్రామంలోని శ్రీ సీతారామాంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గడపగడపకు తిరిగి కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మందడం నరసింహారావు, పీఏసీఎస్ చైర్మన్ మందరపు సుధాకర్‌రావు, సుడా డైరెక్టర్ మందడపు మాధవ్‌రావు, ఆత్మ చైర్మన్ భూక్య లక్ష్మణ్ నాయక్, గ్రామ కమిటీ, ఉప సర్పంచ్, ఎంపీటీసీ, వార్డుమెంబర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఎస్పీతోనే సమన్యాయం



మాట్లాడుతున్న అల్లిక వెంకటేశ్వరరావు

ఖమ్మంరూరల్: గత 77 ఏళ్లగా పాలేరులో ఇప్పటి వరకు ఒక్క బీసీ అభ్యర్థిని కూడా ఎమ్మెల్యేగా ఏ రాజకీయ పార్టీ ప్రకటించలేదని, ఇప్పుడు బీఎస్పీ తరఫున తనను ఎమ్మెల్యే అభ్యర్థిగా బీఎస్పీ ప్రకటించిందని పాలేరు నియోజకవర్గ బీఎస్పీ అభ్యర్థి డాక్టర్ అల్లిక వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. బీసీ అభ్యర్థిగా తనను గెలిపించి పాలేరుకు విముక్తి కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు, జిల్లా అధ్యక్షుడు బుర్రా ఉపేందర్ సాహు, కన్వీనర్ పీసీ వీరాస్వామి, వి.మంజుల, ఎ.రమేష్, డి.సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

మా మద్దతు తుమ్మలకే..

పలువురు ప్రముఖులను కలిసిన మాజీ మంత్రి



న్యాయవాది స్వామి రమేశ్‌తో మాట్లాడుతున్న తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంవన్‌టౌన్: వచ్చే ఎన్నికల్లో తమ మద్దతు మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకేనని పలువురు వెల్లడించారు. ఈ సందర్భంగా గురువారం తుమ్మల నగరంలోని పలువురి ఇళ్లకు వెళ్లి కలిసి మద్దతు కోరారు. ప్రముఖ న్యాయవాది స్వామి రమేష్, వైద్యులు బోడేపూడి శైలజ అజయ్‌కుమార్, రమాదేవి, బాబూరావు, కే.వీ.కృష్ణారావుతో పాటు నిర్మల, మచ్చ లక్ష్మి, మేకల భిక్షమయ్య, ఆడిటర్ ఈశ్వరప్రగడ హరిబాబు, విద్యాసాగర్, ప్రేమ్‌చంద్రనాయక్ తదితరులను తుమ్మల కలిశారు. అలాగే, త్రీటౌన్‌లో మాజీ కార్పొరేటర్ బీజీ.తిలక్ ఆధ్వర్యాన నిర్వహించిన బైక్‌ర్యాలీ, నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్నారు. అతర్వాత మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అఫ్రోజ్ సమీనా ఖయ్యూం, కాంగ్రెస్ నాయకుడు నాగండ్ల దీపక్‌చౌదరి, టీజీఓ సంఘ నాయకుడు ఏలూరి శ్రీనివాసరావు,మేదరమెట్ల స్వరూప రాణిని కూడా కలిశారు. తుమ్మల మాట్లాడుతూ అందరి అభిమానం చూస్తుంటే కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమైనట్లు తెలుస్తోందని వెల్లడించారు.

తుమ్మల యుగందర్‌ను కలిసిన జీపీఆర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు..

రఘునాథపాలెం: మండలంలోని వేపకుంట్లకు చెందిన జీపీఆర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు గురువారం మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగందర్‌ను కలిశారు. కాంగ్రెస్ పార్టీ విజయం కోసం తమ వంతు కృషి చేస్తామని ట్రస్ట్ చైర్మన్ గుర్రం సత్యనారాయణ తెలిపారు. కలిసిన వారిలో ట్రస్ట్ సభ్యులు విక్రమ్, సతీష్, సురేష్, నాయుడు, రమేష్, అచ్చయ్య, ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

రెజొనెన్స్ ఆధ్వర్యాన బతుకమ్మ సంబరాలు



బతుకమ్మలతో డైరెక్టర్లు నాగేంద్రకుమార్, శ్రీధర్‌రావు తదితరులు

ఖమ్మం సహకారనగర్: రెజొనెన్స్ జూనియర్ కళాశాల ఆధ్వర్యాన గురువారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలల డైరెక్టర్లు ఆర్‌వీ నాగేంద్రకుమార్, శ్రీధర్‌రావులు మాట్లాడుతూ.. చదువుతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసేందుకు తాము కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థినులు తీరొక్క పూలను తీసుకొచ్చి బతుకమ్మలను పేర్చి ఆట, పాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు నీలిమ, కృష్ణవేణి, ప్రిన్సిపాల్స్ సతీష్, భాస్కర్ రెడ్డి, శాంతి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని శ్రీవివేకానంద విద్యానికేతన్ పాఠశాలకు చెందిన పదో తరగతి (1981–82వ బ్యాచ్) పూర్వ విద్యార్థులు గురువారం నగరంలోని ఓ హోటల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి స్మృతులను నెమరవేసుకుని విద్యాబుద్ధులు నేర్పిన గురువులు శారద, సుబ్రహ్మణ్యం, కుసుమ, మధుసూదన్‌రావులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నరేంద్ర, నర్సింహారావు, రామకృష్ణ, రాజేందర్, శాంతి, లత తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దుర్గాదేవికి పూజలు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమివ్వగా అర్చకులు పూజలు, నైవేద్యాలు సమర్పించి తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. అనంతరం అమ్మవారి రూపాల విశిష్టతను పూజారులు తెలిపాక దుర్గాదేవి అమ్మవారి మండపాల వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలను పలువురు ప్రజాప్రతినిధులు ప్రారంభించి పూజలో పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంగాంధీచౌక్: శ్రీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో శ్రీ అర్ధనారీశ్వరి అవతారంలో అమ్మవారు



ఖమ్మంగాంధీచౌక్: పూజలు నిర్వహిస్తున్న మాలధారులు



ఖమ్మంగాంధీచౌక్: శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో సంతానలక్ష్మి అవతారంలో అమ్మవారు



ఖమ్మంగాంధీచౌక్: త్రీటౌన్ దాబాల బజార్‌లో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న తుమ్మల నాగేశ్వరరావు



ఖమ్మంగాంధీచౌక్: జమ్మిబండపై శాకాంబరీదేవి అలంకరణలో అమ్మవారు



ఖమ్మంగాంధీచౌక్: శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

ఎమ్మెల్యే కందాళ విస్తృత పర్యటన



ఖమ్మం రూరల్: పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కందాళ

ఖమ్మంరూరల్/ నేలకొండపల్లి/ కూసుమంచి: ఖమ్మం రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి గురువారం విస్తృతంగా పర్యటించారు. తల్లంపాడులో కనకదుర్గమ్మ తల్లి విగ్రహాన్ని దర్శించుకుని పూజలు చేశాక అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే, ఆరెంపులలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన కనకదుర్గమ్మ తల్లిని దర్శించుకున్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణు, నాయకులు జర్పుల లక్ష్మణ్‌నాయక్, ఇంటూరి శేఖర్, బండి సతీష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, నేలకొండపల్లిలో జరిగిన పలు కార్యక్రమాలకు హాజరైన ఎమ్మెల్యే కందాళ దుర్గమ్మను దర్శించుకుని అన్నదానాన్ని ప్రారంభించారు. డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, సర్పంచ్ రాయపూడి నవీన్‌తో పాటు వంగవీటి నాగేశ్వరరావు, మోరం మల్లయ్య, కొండా కనకప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కాగా, పాలేరు ఎమ్మెల్యేగా కందాళ ఉపేందర్‌రెడ్డి మరోమారు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ నాయకులు కూసుమంచి మండలంలోని కిష్టాపురం, పోచారం, తురకగూడెంలో ప్రచారం చేశారు. ఎంపీపీ బానోత్ శ్రీనివాస్‌తో పాటు ఇంటూరి శేఖర్, రామసహాయం బాలకృష్ణారెడ్డి, బానోత్ రాంకుమార్, వేముల వీరయ్య, ఎం.డీ.ఆసిఫ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.